మొలకెత్తిన ధాన్యం

- గురుకుంట కొనుగోలు కేంద్రంలోనే వరిధాన్యం బస్తాలు
- అకాల వర్షాలకు తడిసి ముద్దయిన వడ్లు
- ఆందోళనలో అన్నదాతలు



మొలకెత్తిన ధాన్యం



గురుకుంట కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలు

నవాబుపేట: అకాల వర్షాలకు తోడు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. అష్టకష్టాలు పడి పండించిన వరిధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే.. తేమ పేరుతో కొర్రీలు పెడుతూ సకాలంలో కొనుగోలు చేయడం లేదు. అకాల వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకుంటూ పూర్తిగా ఆరబెట్టిన తర్వాత తూకం వేయిస్తే మిల్లులకు తరలించడంలోనూ జాప్యం చేస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తడిసి మొలకెత్తడం అన్నదాతలను మరింత వేదనకు గురిచేస్తోంది.

వంద బస్తాలకు పైగా..

మండలంలోని గురుకుంట కొనుగోలు కేంద్రంలో వంద బస్తాలకు పైగా ధాన్యం మొలకెత్తింది. ధాన్యాన్ని తూకం వేసి ఐదు రోజులకు పైగా కావొస్తున్నా మిల్లులకు తరలించక పోవడంతో వర్షాలకు తడుస్తూనే ఉన్నాయి. బస్తాల అడుగు భాగంలోకి వర్షపునీరు చేరడంతో తడిసి ముద్దయ్యాయి. ఈ క్రమంలో బస్తాల్లోని ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక మీడియా ఆదివారం కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకొని మొలకెత్తిన ధాన్యం ఫొటోలు తీసుకున్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గంటల వ్యవధిలోనే రెండు లారీల్లో కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించారు. కాగా, అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని అన్ని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు..



కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయింది. చివరకు ధాన్యాన్ని లారీలో తరలించే లోగా మొలకెత్తాయి. ధాన్యం తడిసి మొలకెత్తిన కారణంగా రైతులకు అన్యాయం చేయొద్దు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాంచంద్రయ్య, గురుకుంట

క్లుప్తంగా

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు కొనసాగుతాయి. యథావిధిగా టెండర్ల ద్వార వ్యాపారులు కొనుగోళ్లు చేస్తారు.మంగళవారం అమావాస్య కారణంగా మార్కెట్‌కు సెలవు ఉంటుందని అధికారులు తెలిపారు. తిరిగి బుధవారం ఉల్లి వేలంతో మార్కెట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

స్నేహితుడికి చేయూత



దేవరకద్ర: తమతో పాటు చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తోటి సహచర మిత్రులు తమవంతుగా ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. కొకుంట్ల మండలం పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్‌కు చెందిన బాలస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.73,500 నగదు జమచేసి ఆదివారం బాధితుడికి అందజేశారు. కష్టకాలంలో ఉన్న మిత్రుడిని ఆదుకుని తమ స్నేహాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, శంకర్, కృష్ణసాగర్, రాజుగౌడ్, వెంకటేశ్ యాదవ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ పీబీ ఆర్నాల్డ్ అస్తమయం



జడ్చర్ల: కావేరమ్మపేట ఎంబీ మెడికల్ చారిటబుల్ ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ పీబీ ఆర్నాల్డ్ (85 కన్ను మూశారు. తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ ఆర్నాల్డ్ ఎంబీ మెడికల్ సెంటర్‌లో సుప్రసిద్ధ సర్జన్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయన దాదాపు 55 ఏళ్లపాటు ఇక్కడ వైద్యసేవలు అందించారు. పేద వర్గాలకు వైద్యపరంగా సేవలందించి అందరి మన్ననలు పొందారు. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంను ఎంబీ మెడికల్ చారిటబుల్ ట్రస్టుకు ఆహ్వానించి గుర్తింపు తీసుకువచ్చారు. ఆర్నాల్డ్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా గొల్లపల్లి గ్రామం. ఆయన అంత్యక్రియలు సోమవారం కావేరమ్మపేటలోని ఎంబీ మెడికల్ సెంటర్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సన్నిహితులు తెలిపారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించండి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సనాతన బాలరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ, సీసీరోడ్లను విస్తరించాలని కోరారు. ప్రధాన రహదారిపైనే విద్యుత్ స్తంభాలు ఉన్నాయని.. వాటిని మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సుదీర్‌గౌడ్, హన్మంతు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



నవాబుపేట: మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. బీజేపీ మండల నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆదివారం ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ సూచనలు చేశారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, యాదయ్య, అర్జున్‌రెడ్డి, రాఘవేందర్, చారి ఉన్నారు.

పిల్లలకు సంస్కారం నేర్పాలి: ఎమ్మెల్యే



పాదపూజలో భాగంగా తల్లిదండ్రులను ప్రేమాభిమానాలతో అతుక్కుంటున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పిల్లలకు సంస్కారం నేర్పాల్సింది ఇంట్లోని పెద్దలేనని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బీకేరెడ్డి కాలనీలోని 'నవరత్నాలు' కార్యాలయ ఆవరణలో ఆదివారం మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ సౌజన్యంతో వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న మన సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తప్పకుండా పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు హాజరు కావాలని.. చదువుపై విద్యార్థులకు శ్రద్ధ ఉండేలా చూడాలన్నారు. పాఠశాల స్థాయిలో వారికి ఏది మంచి? ఏది చెడు? అనేది తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని, కొన్ని టీవీ సీరియళ్లు, సినిమాలతో వారిపై చెడు ప్రభావం పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. సెలవులు ఎప్పుడు వచ్చినా పిల్లలకు సంప్రదాయ కళలను నేర్పించాలన్నారు. అలాగే ప్రముఖ ఆలయాలు, దర్శనీయ ప్రదేశాలను సందర్శించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నవరత్నాలు పర్యవేక్షకుడు గుండా మనోహర్, నిర్వాహకులు చిత్తరంజన్‌దాస్, రమేశ్ గురూజీ, రఘు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా ఎ స్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆది రవీంద్రబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్ నుంచి ఉత్తర్వుల కాపీని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎస్సీ,ఎస్టీలకు సామాజిక న్యా యం కోసం, అంటరానితనం నిర్మూలనకు పాటుపడతానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం



నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో మైసమ్మ అడవి కిటకిటలాడింది.

పరామర్శ

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అబ్దుల్లా తండ్రి బాడాబాబు (67) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆదివారం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా బడాబాబు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, అనంతయ్య, నాగిరెడ్డి, మాజీ సర్పంచులు యాదయ్య, చెన్నయ్య, అంజయ్య, నవనీత్, కాంగ్రెస్ నాయకులు జహీర్ అక్తర్, ఖాజా, రవికిరణ్, భూపాల్‌రెడ్డి, సూర్యప్రకాష్ ఉన్నారు.

రాజస్థానీ యువక మండలి ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం, మహేశ్ నవమిని పురస్కరించుకొని రాజస్థానీ నవ యువక మండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ యువకులు, మహిళలు రక్తదానం చేశారు. ప్రతి ఏడాది మహేశ్ నవమి సందర్భంగా మార్వాడీ సమాజం ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని.. ఈ ఏడాది ప్రత్యేకంగా భారత్ విజయం సాధించినందుకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవయువక మండలి అధ్యక్ష, కార్యదర్శులు అమిత్ బాంగడ్, మహేశ్ చందర్ దూత్, మార్వాడీ సమాజం పెద్దలు భగవాన్ దాస్ రాటి, ఓంప్రకాశ్ బాంగడ్, సురేశ్ చందర్ దూత్, నత్మల్ జవర్, రాజేందర్ బంగ్, గోపాల్ లోయ, కమల్‌రాటి, విష్ణు రాటి పాల్గొన్నారు.



మణికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



కర్వెన ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

మహబూబ్‌నగర్ రూరల్/నవాబుపేట/భూత్పూర్/అడ్డాకుల: మహబూబ్‌నగర్ మండలం మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంబురపడ్డారు. తమ గురువులు నారాయణ, శంకరప్ప, నారాయణరెడ్డి, రవికుమార్, వసుంధర, కళావతిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

- నవాబుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ విద్యార్థులు కలుసుకొని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమ గురువులు అనంతప్ప, రేణుకలను ఘనంగా సన్మానించారు.
- భూత్పూర్ మండలం కర్వెన ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ విద్యార్థులు సమావేశమయ్యారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ గురువులు శ్రీనివాసులు, ప్రమీల తదితరులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.
- అడ్డాకుల ఉన్నత పాఠశాల 2005–06 బ్యాచ్ విద్యార్థులు ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 19ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. తమ గురువులు నీలకంఠం, అనంతరెడ్డి, అరుణ, సువర్ణలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.



అడ్డాకులలో..



నవాబుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో..

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ రాంరెడ్డి

జడ్చర్ల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పీబీజీ ట్రస్టు చైర్మన్ రాంరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని నాగసాల గ్రామంలో ఈ నెల 7నుంచి నిర్వహిస్తున్న సావిత్రీబాయి పూలే వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ట్రస్టు చైర్మన్ రాంరెడ్డి, వైస్‌చైర్మన్ కిల్లె గోపాల్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు చదువుపై మరింత మక్కువ కలిగించేందుకు ట్రస్టు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా శిక్షణ శిబిరంలో విద్యార్థులకు అవసరమైన మెళకువలు నేర్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు చక్కటి విద్య అందించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగానికి అందరూ చేయూత అందించాలని కోరారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నవనీత, కార్మిక సంఘం అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

అత్యాపత్యా క్రీడాభివృద్ధికి కృషి



జిల్లా అత్యపత్య సంఘం నూతన కార్యవర్గం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో అత్యపత్య క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా అత్యపత్య సంఘం వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.ముఖేష్ జూమ్ యాప్ ద్వారా సమావేశంలో పాల్గొనగా.. డీవైఎస్ఓ కార్యాలయం నుంచి స్విమ్మింగ్ కోచ్ సయ్యద్ అంజద్ పరిశీలకుడిగా హాజరయ్యారు. జిల్లా అత్యపత్య సంఘం అధ్యక్షుడిగా ఎండీ నాసర్ మొహియొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ముంతాజుద్దీన్, కోశాధికారిగా జగదీశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా మహ్మద్ ఉస్మాన్, గులాం అఫ్రోజ్, ఎ.జగన్ ప్రసాద్, ఎండీ అహ్మద్ హుస్సేన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జె.ప్రదీప్‌కుమార్, షేక్ సైఫ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానం చేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ బోనాలు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

జడ్చర్ల: మండలంలోని బూర్గుపల్లిలో ఆదివారం చౌడమ్మ దేవి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురుమ యాదవులు తమ సంప్రదాయ పద్ధతులతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా మేళతాళాలు, ఒగ్గు కథలతో గ్రామంలో బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 30 ఏళ్లుగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్, మల్లేష్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతతో జ్ఞానం



తాటికొండలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

భూత్పూర్: త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని త్రైత సిద్ధాంత పబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక మక్తల్ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని తాటికొండలో త్రైత సిద్ధాంత భగవద్గీతను గ్రామస్తులకు వివరించారు. త్రైత సిద్ధాంత జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని అన్నారు. కర్మయోగంత విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మానవ శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజించబడి ఉన్నాడని.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతమని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు శ్రీను, కృష్ణయ్య, తిరుపతి, విష్ణు, వెంకటేష్, నీలిమ, కౌసల్య, సావిత్రమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి

కోయిల్‌కొండ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.శివకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గార్లపహాడ్ గేట్ వద్ద ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ఏడాది నియోజక వర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా.. పార్టీలకు అతీతంగా అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపడుతున్నట్లు వివరించారు. అదే విధంగా నిరుద్యోగ యువతను స్వయం ఉపాధిలో ప్రోత్సహించేందుకు రాజీవ్ యువవికాసం పథకం కింద రాయితీపై రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకు సంబంధించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు ఆయన సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.రవీందర్, నాయకులు నరేశ్ గౌడ్, యాదయ్య, రామస్వామి, యునూస్ అలీ, మహమ్మద్, మడుగు వెంకటయ్య ఉన్నారు.

రహదారిపై మట్టి.. ఆదమరిస్తే ప్రమాదం



కాటవరం తండా స్టేజీ సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టి, ఇసుక

అడ్డాకుల: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై చాలా చోట్ల మట్టి, ఇసుక పేరుకు పోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలే జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. రహదారిపై మట్టి, ఇసుక వంటివి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాబా హోటళ్లు, పెట్రోల్ బంకులు, పంక్చర్ షాపులు ఉన్న చోట పెద్దఎత్తున మట్టి, ఇసుక రోడ్డుపైకి వచ్చి పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా కాటవరం తండా స్టేజీ వద్ద ఉన్న దాబా వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇక్కడ పెద్దఎత్తున మట్టి, ఇసుక రోడ్డుపైకి వచ్చింది. అడ్డాకుల వైపు నుంచి రాంగ్‌రూట్లో ఈ రోడ్డుపై ఎక్కువగా బైకులు, ఆటోలు, ట్రాక్టర్లు తండా స్టేజీ వరకు వస్తాయి. ఇక్కడ ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కోస్గి రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు మండల పరిధిలోని నాచారం గ్రామానికి చెందిన మెతుకు చంద్రయ్య అనారోగ్యానికి గురి కావడంతో పట్టణంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మెతుకు చంద్రయ్య భార్య మెతుకు పార్వతమ్మ పాల కోసం బస్టాండ్‌కు వెళ్తుండగా సాయిబాబా ఆలయ సమీపంలో గుర్తు తెలియని ఓ ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో పార్వతమ్మ తలకు తీవ్ర గాయాలు కాగా కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.